

దీపావళి శోభ


పెద్దేముల్: మంబాపూర్‌లో చిన్నారితో కలిసి ఇలా..


కుటుంబసభ్యులతో కలిసి క్రాకర్స్ కాల్చుతున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

జిల్లా వ్యాప్తంగా వెలుగుల పండుగను సంబురంగా జరుపుకున్నారు. ఇళ్లు, దుకాణాల్లో లక్ష్మీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. గురు, శుక్రవారాల్లో నోములు, వ్రతాలు ఆచరించారు. ఇంటింటా దీపాలు వెలిగించి ఆనందోత్సాహాల నడుమ టాపాసులను కాల్చి పండుగను జరుపుకున్నారు. చీకట్లు తొలగి, సంతోషాల వెలుగులు నిండాలంటూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వాడవాడలా పిండి వంటల వాసనలు గుమగుమలాడాయి.


కొడంగల్‌లో టపాసులు కాల్చుతున్న చిన్నారులు


ఎన్యుమరేటర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

రైతుల ఇష్టానుసారమే భూ సేకరణ

బొంరాస్‌పేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు రైతు ఇష్టానుసారంగానే భూ సేకరణ నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం వారు దుద్యాల మండలంలో పర్యటించి కుల గణన సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లతో మాట్లాడారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని వారికి సూచించారు. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూ సేకరణపై రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. ప్రభుత్వం పరిహారం పెంచే విషయమై యోచిస్తున్నట్లు తెలిపారు. ఎకరా భూమి కోల్పోయే రైతుకు 125 గజాల ప్లాట్ తోపాటు ఇంటికో ఉద్యోగం, పరిహారం అందిస్తామన్నారు. చాలా మంది రైతులు పరిహారం వస్తుందో రాదో అనే అపోహను తొలగించేందుకు ప్రభుత్వం నిధులను సబ్ కలెక్టర్ ఖాతాలో జమ చేసిందన్నారు. రైతులు భూములు ఇచ్చి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

డీఎంహెచ్‌వోగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ



వికారాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ డీఎంహెచ్‌వోగా వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువాలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు. అనంతరం వెంకటరమణ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజు, డాక్టర్ రవీంద్రయాదవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


శామీర్‌పేట బాబాగూడలో ఇంటింటికీ స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

50 ప్రశ్నలు.. 60 రోజులు

- ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభం
- మొత్తం 2,728 మంది ఎన్యుమరేటర్లు
- ఇప్పటికే ఎన్యుమరేటర్లకు శిక్షణ పూర్తి

సమగ్ర కుల గణన చేపట్టేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 6వ తేదీన ప్రారంభం కానున్న ఈ ప్రక్రియ రెండు నెలల కాల వ్యవధిలో పూర్తయ్యేలా మార్గదర్శకాలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఎన్యుమరేటర్లకు శిక్షణ పూర్తి కాగా, వారు ఒక్కో రోజు 15 ఇళ్లను సందర్శించి వివరాలను సేకరించనున్నారు. ఈ సర్వే ద్వారా 50 ప్రశ్నలకు సామాధానాలు తీసుకొని సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి తదితర అంశాలను నమోదు చేయనున్నారు.

సమగ్ర కుల గణనకు సర్వం సిద్ధం

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సమగ్ర కుల గణన చేపట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రభుత్వం 6వ తేదీ నుంచి సామాజిక సమగ్ర కుల సర్వేను ప్రారంభించనున్నందున అందుకు అవసరమైన మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఎన్యుమరేటర్లకు శిక్షణ కూడా పూర్తి చేశారు. ఈ సర్వేను రెండు నెలల్లో పూర్తయ్యే విధంగా

మిగతా 8వ పేజీలో...

స్వచ్ఛందంగా తెలిపిన వివరాలనే నమోదు చేయాలి : కలెక్టర్ గౌతమ్

సర్వేలో భాగంగా శామీర్‌పేట బాబాగూడలో శుక్రవారం ఇంటింటికీ స్టిక్కర్ల అంటివేత కార్యక్రమాన్ని కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. 150 ఇళ్లకు ఒక బ్లాక్ చొప్పున కేటాయించారు. సర్వేలో కుటుంబ యజమాని స్వచ్ఛందంగా తెలిపిన వివరాలను మాత్రమే ప్రోఫార్మాలలో నింపాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్యుమరేటర్లకు సూచించారు. ఆధార్, ఓటరు కార్డు ఉన్న వారి వివరాలను తప్పక నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, ఎండీఓ మమతా బాయిని, ఎంపీఓ వినూత్న పాల్గొన్నారు.



7న కలెక్టరేట్‌లో బహిరంగ

విచారణ

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తెలిపేందుకు ఈనెల 7వ తేదీన కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ ఉంటుందని కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు రంగారెడ్డి జిల్లా, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4 గంటల వరకు వికారాబాద్ జిల్లాకు సంబంధించి బహిరంగ విచారణ ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థలకు కల్పించాల్సిన రిజర్వేషన్ల విషయంలో బీసీ సంఘాలు, సంచార జాతులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంచార జాతుల కుల పెద్దలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కులపెద్దలు, కమిషన్ ఇచ్చే నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటు ఆరు సెట్లతో తెలుగు/ఇంగ్లీషు భాషలో బహిరంగ విచారణకు హాజరు కావాలని ఆయన తెలిపారు.



హెచ్‌సీఏ రాష్ట్ర జట్టుకు

భవిష్యరెడ్డి

తాండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అండర్ -15 బాలికల విభాగంలో రాష్ట్ర జట్టులోకి తాండూరు పట్టణానికి చెందిన సి. భవిష్యరెడ్డికి స్థానం దక్కింది. రాష్ట్ర జట్టులో తాండూరు బాలికకు స్థానం దక్కడంతో ఈ ప్రాంతం క్రీడాకారులు అభినందిస్తున్నారు. బీసీసీఐ గర్ల్స్ అండర్ -15 ట్రోఫీలో అర్హత సాధించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైంది. తాండూరు లెజెండ్స్ క్రికెట్ అకాడమీ తరఫున శుక్రవారం బాలికను తాండూరులో సన్మానించారు. కార్యక్రమంలో కోచ్‌లు ఎండీ. సైహిలు, సోయల్, పాల్గొన్నారు.

ఎద్దుల తాడు చుట్టుకొని యువకుడి మృతి



దౌల్తాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చెరువులో ఎద్దులకు స్నానం చేయించేందుకు వెళ్లిన యువకుడు వాటికి కట్టిన తాడు చుట్టుకొని మృతి చెందాడు. ఈ సంఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో జరిగింది. దౌల్తాబాద్‌కు చెందిన ఊరడి చెన్నప్ప(18) శుక్రవారం ఉదయం చెరువులో ఎద్దులకు స్నానం చేయించేందుకు వెళ్లాడు. ఆ క్రమంలో ఎద్దుల తాడు కాళ్లకు చుట్టుకోవడంతో చెరువులో మునిగి మృతి చెందాడు.



సంతా.. మా ఊరి సంత

జాతరలా సర్దార్‌నగర్ అంగడి

- జిల్లాలోనే ఇది పెద్ద పశువుల సంత
- నిత్యావసరాలతో పాటు, దుస్తులు, పనిముట్లు లభ్యం
- పక్క జిల్లాల నుంచి కూడా రాక

7

ఆధునిక పోకడలతో దూసుకెళ్తున్న నేటి కాలంలో సూపర్ మార్కెట్లకు ఆదరణ పెరుగుతోంది. జనాభా ఎక్కువ ఉన్న పట్టణాల్లో కార్పొరేట్ స్థాయిలో మార్కెట్లు వెలుస్తున్నాయి. అయినా పల్లెల్లో అలనాటి అంగళ్లకు ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. ప్రతీ రోజు ఎక్కడో ఒక చోట సంత జరుగుతూనే ఉంటుంది. ఒకప్పుడు అంగట్లో కూరగాయలు, పశువులు, దుస్తులు మాత్రమే కనిపించేవి. నేడు ఆధునిక పోకడలకు సంబంధించిన సామగ్రి సైతం దర్శనమిస్తున్నాయి. షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ సంతపై ప్రత్యేక కథనం.



కీసరగుట్టకు కార్తీక శోభ

కార్తీకమాసోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు
- దర్శనానికి ఐదు రకాల లైన్ల ఏర్పాటు
- పెద్ద సంఖ్యలో హాజరుకానున్న భక్తజనం
- ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ నిర్వాహకులు



కీసర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి కీసరగుట్టలో కార్తీక శోభ సంతరించుకొనుంది. హిందువులు పవిత్రంగా భావించే కార్తీక మాసోత్సవం పురస్కరించుకొని సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన కేసరగిరి క్షేత్రంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ సందర్భంగా నెల రోజుల పాటు ఆలయంలోని మూలవిరాట్ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయన్నారు. వేలాదిగా తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా

మిగతా 7వ పేజీలో...

పరిగి ఆస్పత్రిలో

వైద్యుల నిర్లక్ష్యం!

పురిటి నొప్పులతో వస్తే గర్భిణిని బయటకు పంపిన వైనం

చేసేదేమీలేక ప్రైవేట్ వాహనంలో వికారాబాద్ ఆస్పత్రికి..

7

కార్మిక చట్టాలను తొలగిస్తే ఊరుకోం

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి

7

గురుకుల పాఠశాలలో

సంబురాలు

కాస్మోటిక్ చార్జీల పెంపుపై విద్యార్థుల హర్షం

8


పూడూరు సదర్ ఉత్సవంలో దున్న విన్యాసం

సదర్ సంబురం

ఘట్‌కేసర్/మేడ్చల్ టౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గురువారం ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజులు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ సదరు పండుగ యాదవులకు పశువులపై ఉన్న ప్రేమానురాగాలను తెలియజేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం దీపావళి రోజున యాదవులు కలిసికట్టుగా ఈ ఉత్సవం ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు యాదవులు తమ దున్నపోతులను విన్యాసాలు నిర్వహించారు.

పూడురులో వైభవంగా..

అలాగే మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరు గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దున్నపోతులను అందంగా అలంకరించి మల్లన్న ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేడుకలను ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, ఎల్లంబాబు యాదవ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ స్వామి యాదవ్, మాజీ సర్పంచ్ బాబు యాదవ్ పాల్గొన్నారు.

మైసిగండి ఆలయాన్ని తీర్చి దిద్దుతాం

కడ్తాల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మైసిగండి మైసమ్మ ఆలయాన్ని పర్యాటకంగా, దర్శనీయ స్థలంగా తీర్చి దిద్దుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మైసమ్మ ఆలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలతో పూజలు నిర్వహించారు. ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఆలయ నిర్వాహకుడు రామావత్ భాస్కర్ ఎమ్మెల్యేను సత్కరించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మైసమ్మ ఆలయాన్ని మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, శేఖర్‌గౌడ్, జవహర్‌లాల్, హీరాసింగ్, తులసీరామ్, సురేందర్‌రెడ్డి, అరుణ్, తహసీల్దార్ ఆర్పీ.జ్యోతి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కడ్తాల్: మైసిగండి పురేనగిరి గుట్టపై దత్తాత్రేయస్వామి, శివాలయ నిర్మాణానికి భూమి పూజచేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి హాజరై పూజలో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ మాదారం శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో యాట నర్సింహ, భగవాన్ ఫౌండేషన్ ఛైర్మన్ దూద్యానాయక్, గూడూరు భాస్కర్ రెడ్డి, రవి, రూప్‌సింగ్, తారాసింగ్, సుబ్బు, శంకర్, రాజా, శ్రీను, కిషన్, పూజారి బిచ్యా, బిక్కు, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.


మైసిగండిలో ఎమ్మెల్యే కసిరెడ్డి పూజలు

క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాడీ బిల్డింగ్ పోటీల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మీవెంట నేనున్నానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బాడీ బిల్డర్ నితిన్‌కుమార్‌గౌడ్‌కు హామీ ఇచ్చారు. కరన్‌కోట్ గ్రామానికి చెందిన నితిన్‌కుమార్‌గౌడ్ బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాడు. జనవరిలో జరిగే జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు సిద్ధమవుతున్న నితిన్‌కు రూ.20వేలఆర్థిక సహాయాన్ని అందజేశారు.విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లొంక నర్సింహులు ఉన్నారు.

షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

దోమ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దోమ మండలంలోని బొంపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పరిగి సబ్ డివిజన్ షీ టీం ఇన్‌చార్జ్ నర్సిములు ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలపై జరుగుతున్న దాడులు, బాల్య వివాహాలు, బ్యాంకింగ్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ పోలీసు కళాజాత బృందం ఇంచార్జ్ అశోక్, ఎంఈవో వెంకట్, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు మనీషా, శోభారాణిపాల్గొన్నారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

కొడంగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

యాచారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని యాచారం సొసైటీ ఛైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి గున్‌గల్‌లో జీఎంపీఎల్ క్రికెట్ పోటీలో విజేత జట్టుకు ట్రోఫీ అందించి మాట్లాడారు. విద్యార్థులు, యువకులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించి పేరు తేవాలన్నారు. జిల్లాలో గున్‌గల్‌కు పేరు ప్రఖ్యాతులున్నాయని, గ్రామం నుంచి ఉన్నతోద్యోగాల్లో ఉండి గ్రామానికి మంచి పేరు తెస్తున్న విషయాన్ని మనం గమనించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, భీమ్‌యాదవ్, రవి ఉన్నారు.

రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు



మంచాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పి.నీలమ్మ అన్నారు. సీపీఐ అనుబంధ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ సదస్సు వాల్‌పోస్టర్‌ను శుక్రవారం మంచాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యదర్శి శివరాల లక్ష్మయ్య, నాయకులు నర్ల శ్రీశైలం, విజయ్‌కుమార్, అంబోత్‌రాజూ, గాలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీవో

షాద్‌నగర్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎన్ఆర్ సరిత శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యే మట్లాడుతూ రెవెన్యూ పరంగా రైతులకు సేవలందేలా చూడాలన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కృషిచేస్తానని ఆర్డీవో చెప్పారు.


ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న ఆర్డీవో

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

షాద్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఫెడరేషన్ షాద్‌నగర్ ఇన్‌చార్జి ఆకాశ్ నాయక్ గురువారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ విద్య, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం శ్రద్ధ చూపాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8కోట్లకుపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, దీంతో 13లక్షల మంది విద్యకు దూరం అయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో ఫీజులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కళాకారిణికి ఎమ్మెల్యే అభినందన



రాజ్ఞికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ కళలైన కూచిపూడి నృత్యం, జానపదం, నాటకాల్లో ప్రతిభ కనబరుస్తున్న బాలిక రాజ్ఞిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. షాద్‌నగర్ శివమారుతి గీతా అయ్యప్ప ఆలయ అర్చకుడు రవిశర్మ-మాధురిల కుమార్తె రాజ్ఞి చదువుకుంటూనే కళల్లో రాణిస్తోంది. సంస్కార భారతి సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శంకర్‌ను కలిశారు. ఎమ్మెల్యే రాజ్ఞిని అభినందించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యులు కె.రంగనాథం, టీవీ రంగయ్య, జి.రంగారెడ్డి, రమేష్‌చారి, సాయికృష్ణ, ప్రవీణ్, మాధురి పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



టీటీడీ చైర్మన్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా నియామకమైన బీఆర్ నాయుడి(టీవీ5 చైర్మన్)ని శుక్రవారం ఆయన నివాసంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకొని, అలాగే టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా హైదరాబాద్‌లో నాయుడిని ఎమ్మెల్యే కలిశారు. స్వామి వారి దర్శనానికి ఎమ్మెల్యేలు, ఎంపీల రికమండేషన్ లెటర్లను అమోదించాలని నాయుడుని కోరానని ఎమ్మెల్యే తెలిపారు.

కుల గణనకు కాంగ్రెస్ శ్రేణులు సహకరించాలి



మాట్లాడుతున్న కేఎల్లార్

మహేశ్వరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక అసమానతల తొలగింపునకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తలపెట్టిన కుల గణన సర్వేకు కాంగ్రెస్ శ్రేణులు అధికారులకు సహకరించాలని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న కుల గణన 30నాటికి పూర్తి చేసి రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అభివృద్ధి ఫలాలు పేదలకు అందేలా కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. రాహుల్ గాంధీ చెప్పినట్లు అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే కుల గణన సర్వే అవసరమన్నారు. సర్వేకు గ్రామాలకొచ్చే అధికారులకు ఇబ్బందులు తలెత్తకుండా సహకరించే బాధ్యత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయించండి



కోదండరెడ్డికి వినతిపత్రమిస్తున్న మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి

యాచారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):మండలంలో ఫార్మాసిటీని రద్దుచేయించాలని గురువారం రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డికి కుర్మిద్ద మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, రైతులు వినతిపత్రమందజేశారు. ఫార్మాసిటీకి ఇంకా భూములుకావాలని అధికారులు నోటీసులు ఇవ్వకుడా చొరవ తీసుకోవాలని కోరారు. ధరణిలో నిషేధిత జాబితాలో ఉన్న భూములపై ఆంక్షలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బి.శ్రీనివాస్, వినోద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ ఎదగాలి



మంత్రి సీతక్కను కలిసిన భీంభరత్, గౌరీసతీష్

మొయినాబాద్ రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఎదగాలని, అందుకు కష్టపడి పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లోని మంత్రి కార్యాలయంలో సీతక్కను చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్ కలిశారు. చేవెళ్లలో పార్టీని పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌత్‌సతీష్, మండల అధ్యక్షుడు మానెయ్య, నాయకులు జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భిక్షపతి ఉన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



ఏఐటీయూ జెండా ఎగరవేస్తున్న నాయకులు

శంషాబాద్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని అంబేడ్కర్‌చౌరస్తాలో గురువారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ 105వ వార్షికోత్సవాల్లో భాగంగా యూనియన్ జెండాను జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు ఎగరవేశారు. కార్మికులు హక్కుల కోసం కలసికట్టుగా పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గిరి, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభు, కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీకి పునర్వైభవాన్ని తెద్దాం



మొయినాబాద్ రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పునర్వైభవాన్ని తీసుకొద్దామని, కార్యకర్తలు కష్టపడి పార్టీ సభ్యత్వ నమోదును చేయించాలని టీడీపీ చేవెళ్ల పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ కాట వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం మొయినాబాద్‌లో పార్టీ మండల అధ్యక్షుడు యాదయ్యగౌడ్ అధ్యక్షతన సభ్యత్వ నమోదుపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ కార్యకర్తలకు టీడీపీ తోడుగా ఉంటుందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో రాఘవులు, మానిక్యం, దామోదర్‌రావు, ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున్, సత్యనారాయణ, అమీర్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.





సంతలో అమ్మడానికి సిద్ధంగా ఉన్న వ్యవసాయ పనిముట్లు

సంతా.. మా ఊరి సంత

జాతరలా సర్దార్‌నగర్ అంగడి

- జిల్లాలోనే ఇది పెద్ద పశువుల సంత
- నిత్యావసరాలతో పాటు, దుస్తులు, పనిముట్లు లభ్యం
- పక్క జిల్లాల నుంచి కూడా రాక

షాబాద్, సెప్టెంబర్ 18: షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో ప్రతీ మంగళవారం సంత జరుగుతుంది. ఇక్కడ పశువుల సంత రంగారెడ్డి జిల్లాలోనే అతి పెద్దది. ఈ సంతకు తలమానికం పశువుల అంగడి. అందులో ముఖ్యంగాఎద్దులు, గేదెలు, మేకల క్రయవిక్రయాలు అధికంగా జరుగుతాయి. రైతులు ఎంత ఆధునిక వ్యవసాయం చేస్తున్నా ఇంకా ఎద్దులపై మోజు తగ్గడం లేదు. పాల కోసం గేదెలు, ఆవులను కొనుగోలు చేసేందుకు చాలా మంది సంతకు వస్తుంటారు. ఫలితంగా సంతలో పశువులకు విపరీతమైన గిరాకీ ఉంటుంది. పక్క జిల్లాలైన మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నల్లగొండ జిల్లాల నుంచి ఇక్కడికి అధిక సంఖ్యలో రైతులు వస్తుంటారు.

రంగురంగుల దుస్తులు...

పల్లె ప్రాంతాల జనాలు ఎక్కువగా సంతలో దుస్తులు కొనడానికి ఇష్టపడతారు. ఇందుకు కారణం కారు చౌకగా లభించడమే. సాధారణంగా దుకాణాల్లో దొరికే వాటికంటే పదుల రెట్లు తక్కువ ధరకు ఇక్కడ లభిస్తాయి. అందుకే ప్రత్యేకంగా జనం సంత రోజున దుస్తులు కొనడానికి వస్తారు. అంతే కాదండి ఇక్కడ ప్రత్యేకంగా నేసిన గొంగళ్లు కూడా లభిస్తాయి. గొంగళ్లను కొనేందుకు యాదవలు అధికంగా ఇష్టపడతారు.

చౌక ధరలకు కూరగాయలు

పప్పులు, ధాన్యాలు కిరాణ దుకాణాల్లో కొంటే ధరలు అధికంగా ఉంటాయి. అందుకే నిరుపేద, మధ్యతరగతి



అమ్మడానికి సిద్ధంగా ఉన్న గొంగళ్లు

కుటుంబాల వారంత సంతలో సరుకులు కొనడానికి ఇష్టపడతారు. అందుకు అనుగుణంగా సంతలో వివిధ రకాల పప్పులు, ధాన్యాలు విక్రయిస్తున్నారు. అదే విధంగా రైతులు పండించిన కూరగాయలు కూడా ఇక్కడ విక్రయిస్తుంటారు. ఇక్కడ వినియోగదారులకు కూరగాయలు అతి చౌకగా దొరుకుతాయి. దీంతో సంతలో కూరగాయలకు మంచి గిరాకి ఉంది.

రైతులకు అవసరమైన అన్ని పనిముట్లు

సంతలో రైతులకు వ్యవసాయానికి కావల్సిన పనిముట్లు అన్ని ఇక్కడ దొరుకుతాయి. సంతలో మార్కెట్ ధరకన్న తక్కువ రేట్లలో పనిముట్లు దొరుకుతాయి. అందుకే రైతులు సంతలో కొనుగోలు చేసేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఇంటి సామగ్రి తీసుకోవడానికి ఇష్టపడుతారు. ఇంట్లోకి కావలసిన సామాన్లు సైతం చౌక ధరకే దొరుకుతున్నాయి. ఇక్కడ ప్రజలకు ప్రతి వారం అందుబాటులో ఉంటాయి.



శుభ్రం చేయించిన కుర్మిద్ద క్రీడాప్రాంగణం

క్రీడాప్రాంగణంలో పిచ్చిమొక్కల తొలగింపు

యాచారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలం కుర్మిద్దలోని క్రీడా ప్రాంగణంలో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయని గత నెల 28న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వెంచర్ నిర్వాహకులు స్పందించారు. ప్రాంగణంలో పెరిగిన గడ్డిని డోజర్‌తో తొలగించారు. పంచాయతీ సిబ్బంది దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో వెంచర్ నిర్వాహకులే చొరవ చూపి క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు.

నన్నూరి నర్సిరెడ్డికి ఘన సన్మానం



నన్నూరి నర్సిరెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న టీడీపీనాయకులు

ఘట్‌కేసర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి):టీడీపీ సీనియర్ నాయకులు నన్నూరి నర్సిరెడ్డికి తెలంగాణ నుంచి టీటీడీపాలకమండలి సభ్యులుగా నియమితులైనందున శుక్రవారం మేడ్చల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మాజీ కోఆర్డినేటర్ సుంకరి వెంకటేష్ ఆద్వర్యంలో కలిసి అభినందనలు తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ ట్రస్టుభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్రంనుండి టీటీడీ బోర్డు సభ్యులుగా ఎన్నికకావడం అభినందనీయమన్నారు. పార్టీకి ఎన్నో విధాలుగా సేవలందించిన నన్నూరి నర్సిరెడ్డికి టీటీడీ పాలకమండలిలో స్థానం కల్పించడంపైపార్టీ అధినేతచంద్రబాబు నాయడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల సంజీవగౌడ్, సామల జగన్‌మోహన్‌రెడ్డి, మహేష్ తదితరులుపాల్గొన్నారు.

కీసరగుట్టకు కార్తీక శోభ

(5వ పేజీ తరువాయి)

శని, ఆది, సోమవారాల్లో భక్తులు పెద్ద సంఖ్యల్లో వచ్చే అవకాశం ఉన్నందున నిర్వాహకులు, పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

ఐదు రకాల క్యూలైన్ల ఏర్పాటు

కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకునేందుకు ధర్మ దర్శనం, ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, వీఐపీ దర్శనం, రుద్రాభిషేకం(అభిషేకాలు) అనే ఐదు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ప్రముఖులు విచ్చేసిన సమయంలో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగుకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా భక్తుల రద్దీ దృష్ట్యా క్షేత్రానికి వచ్చే రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు నియంత్రించేందుకు పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

భక్తులు సహకరించాలి

ఈ నెల రోజుల పాటు మామూలు రోజుల్లో దాదాపు 50 నుంచి 60 మంది సిబ్బందితో విధులు నిర్వహించనున్నారు, శని, ఆది, సోమవారాల్లో, ప్రత్యేక పర్వదినం సందర్భాల్లో ఆ సిబ్బందిని 100కు పెంచే అవకాశం ఉందని సీఐ వెంకటయ్య తెలిపారు. వాహనాలను కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేయాలని, ఇష్టానుసారంగా క్షేత్రంపైకి తీసుకురావద్దని, పోలీస్ అధికారుల విధులకు ఆటంకం కలిగిచకుండా భక్తులు సహకరించాలని వెంకటయ్య సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాదాల కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం వర్మ, ఈవో సుధాకర్ తెలిపారు.

మొదటి రోజు రుద్రాభిషేకం

మొదటి రోజు శనివారం స్వామివారికి శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఆదివారం ఆకాశ దీపోత్సవం ప్రారంభించి, క్షీరాభిషేకం జరిపిస్తారు. మూడో రోజు సోమవారం నానా విధ ఫల రసాభిషేకం నిర్వహిస్తారు. నాలుగో రోజు(5వతేదీ) నాగుల చవితి సందర్భంగా నాగదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇలా ఒక్కోరోజు ఒక ప్రత్యేకమైన పూజలు నిర్వహించనున్నారు. డిసెంబరు 1వ తేదీ(ఆదివారం) కార్తీక అమావాస్య సందర్భంగా తైలాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించడంతో కార్తీక మాసం పరిసమాప్తం అవుతుంది.



జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ పండిట్

కార్మిక చట్టాలను తొలగిస్తే ఊరుకోం

తాండూరు, నవంబరు 1: కార్మికుల వేతనాలు చెల్లింపు విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనాన్ని ఇవ్వాలన్న ఆదేశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పర్చాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ పండిట్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకొని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. బీజేపీ ప్రభుత్వం కార్మికుల చట్టాలను తొలగించి, 4కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాసేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని కార్మికులు తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు పరం చేసే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఆమె ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు భూపతి, గోపాల్, తదితరులు ఉన్నారు.

సీలింగ్ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పరిగి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మిట్టకోడూరు గ్రామంలో ప్రభుత్వ సీలింగ్ భూమిని అక్రమంచుకున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని కోరుతూ, సీపీఐ, బీకేఎంయూల ఆధ్వర్యంలో శుక్రవారం పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్ మాట్లాడుతూ, మిట్టకోడూరులో ప్రభుత్వ సీలింగ్ భూమిలో ఎనిమిది మంది కబ్జాలో ఉన్నారని, ఐదుగురి వ్యక్తులపై అధికారులు కేసులు పెట్టించారని, మిగతా ముగ్గురిపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. చట్ట ప్రకారం కబ్జాలో ఉన్నవారందరిపై కేసు పెట్టాలే, కానీ కొందరిపై పెట్టి కొందరిని వదిలివేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు పరిగి యాదయ్య, రాంచంద్రయ్య, మల్లయ్య తదితరులు ఉన్నారు.

ప్రతీ విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

తాండూరు, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, భవిష్యత్తులో ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలంటే సేంద్రియ ఎరువులతో పండించిన వాటిని తినాలని ఏకలవ్య ఫౌండేసన్ సంయుక్త కార్యదర్శి బాలకృష్ణ పేర్కొన్నారు తాండూరులోని గురుకుల బాలికల పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ విద్యావాహిని అధ్వర్యంలో నిర్వహించిన కాంపిటేషన్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.మార్కులు కాదు సమాజంలో మార్పు వచ్చే విధంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కేవీఎం వెంకట్, ప్రిన్సిపల్ ప్రవీణారెడ్డి కోఆర్డినేటర్ తుల్జప్ప, రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



కీసర, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో ప్రభుత్వ గురుకుల కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఎయిడ్స్, క్షయ వ్యాధి, టీబీ వ్యాధుల పట్ల కోఆర్డినేటర్ రాంరెడ్డి అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి అంటువ్యాధి అని మనలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే వేరే వాళ్లు దగినా, తుమ్మిన వెంటనే మనకి వ్యాధిసోకే అవకాశం ఉంటుందని, జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు భవానీ, రాణి పాల్గొన్నారు.

బిల్లుల కోసం డెయిరీ మేనేజర్ నిలదీత



యాచారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నెలల తరబడి బిల్లులివ్వకపోగా దాణా ధర పెంచుతున్నారని కుర్మిద్దలో గురువారం మాల్ మదర్ డెయిరీ మేనేజర్ వెంకటయ్యను పాడి రైతులు నిలదీశారు. డెయిరీకి పాలుపోయాలంటూ మరోసారి గ్రామానికి రావొద్దన్నారు. దాణాధర పెంపు యాజమాన్య నిర్ణయమేనని మేనేజర్ సముదాయించే ప్రయత్నం చేశారు. ఆవుపాలు లీటర్‌కు రూ.31, గేదెపాలు రూ.38 మాత్రమే ఇస్తున్నారని రైతులు వాపోయారు. ఆవుపాలు రూ.38కి, గేదెపాలు రూ.45 పెంచాలని డిమాండ్ చేశారు. విజయడైరీ పాడి రైతులను కాపాడుకుంటోందని, ఆ డెయిరీ ఇస్తున్న రేటునే మదర్ డెయిరీ కూడా ఇవ్వాలని, లేదంటే మదర్ డెయిరీకి పాలుపోయం అని రైతులు తేల్చి చెప్పారు. తాను రైతులకు రూ.2లక్షల డబ్బు అందజేసి ఆదుకున్నానని మదర్ డెయిరీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు.

పింఛన్ పెంపు కోసం 16న కలెక్టరేట్ వద్ద దీక్ష

తలకొండపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం వివక్ష వీడాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు/వితంతువులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ. 6వేల పింఛనివ్వాలని డిమాండ్ చేశారు. తలకొండపల్లిలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) సమావేశాన్ని నిర్వహించారు. దివ్యాంగుల సమస్యలు, ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరసన, 20న ఇబ్రహీంపట్నంలో నిర్వహించే వికలాంగుల హక్కుల పోరాట సమితిసభ విజయవంతంపై చర్చించారు. కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమానికి వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు తరలిరావాలన్నారు.

విద్యార్థి మృతి.. మూడో రోజు స్కూల్‌కు సెలవు!

- ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

బషీరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థి చనిపోతే మూడు రోజు పాఠశాలకు స్థానిక సెలవు ప్రకటించడమేమిటంటూ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. బషీరాబాద్ మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి రాంచరణ్ రోడ్డు ప్రమాదంలో బుధవారం రాత్రి మృతి చెందాడు. కాగా, దీపావళి పండగ తర్వాత శుక్రవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థి మృతి పట్ల చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జీహెచ్‌ఎం నిర్ణయం తీసుకుని మూడోరోజు శుక్రవారం సెలవు ప్రకటించారు. ఈ నిర్ణయంపై పలువురు తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా పలువురు ఉపాధ్యాయులు జీహెచ్‌ఎం తీరును తప్పుబడుతూ విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయినా పాఠశాల సమయం ముగిసేవరకు స్కూళ్లోనే ఉండటం గమనార్హం. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు జీహెచ్ఎంను అడిగితే నా ఇష్టం, మీరెవరూ అడగడానికంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడడని స్థానికుడు రవిగౌడ్ ఆరోపించారు. కాగా, జీహెచ్‌ఎం జగదీశ్వర్‌ను వివరణ కోరగా విద్యార్థి మృతికి సంతాప సూచకంగా, స్థానిక ఉపాధ్యాయుల సమష్టి నిర్ణయంతోనే జిల్లా విద్యాధికారికి సెలవు ప్రకటిస్తున్నట్లు ముందురోజే మెస్సేజ్ చేశానన్నారు. దీన్ని కొందరు ఉపాధ్యాయులు రాజకీయం చేయడం తగదన్నారు.

మండల సాధనకు గట్టిప్పలపల్లి వాసుల పోరుబాట



తలకొండపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాన్ని ప్ర భుత్వం మండలం చేయాలని గట్టిప్పలపల్లి వాసులు పోరుబాటపట్టారు. జేఏసీగా ఏర్పడి శుక్రవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. దీక్షలో అశోక్‌గౌడ్, రాజేందర్, శరత్‌చంద్ర, ఆంజనేయులుగౌడ్, అనిల్, యాదగిరి, కృష్ణాజీ, చెన్నయ్య ప్రణయ్‌కుమార్ కూర్చున్నారు. వెంకట్రావ్‌పేట, గౌరిపల్లి, ఖానాపూర్, చౌదర్‌పల్లి, బల్సులపల్లితండా, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, కేపీతండాలతో కలిపి గట్టిప్పలపల్లిని మండలం చేయాలని డిమాండ్ చేశారు. 2022, 2023లలోనూ దీక్షలు చేశామన్నారు. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తే సీఎంగా ఉన్న నేపథ్యంలో గట్టిప్పలపల్లిని మండలం చేయాలని నాయకులు కోరారు.

పరిగి ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం



వికారాబాద్ ఆస్పత్రిలో తల్లీబిడ్డ

పరిగి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డెలివరీ కోసం పురుటి నొప్పులతో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఓ గర్భిణి పట్ల డాక్టర్లు, సిబ్బంది ప్రదర్శించిన తీరుతో నరకాన్ని చూసింది. పరిగి మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివయ్య కూతురు హేమలత నిండు గర్భిణి. గురువారం తెల్లవారుజామున పురుటి నొప్పులతో పరిగి ఆస్పత్రికి తీసుకొచ్చారు. నొప్పులతో అవస్థలు పడుతుంటే డ్యూటీ డాక్టర్ సిబ్బంది కనీసం చూడకుండానే ఇక్కడ డెలివరీ కాదు, ఇక్కడి నుంచి తీసుకెళ్లండని ఉచిత సలహా ఇచ్చారు. తాము పేదవాళ్ల నగరానికి వెళ్లలేం.. చూడండని ఆమె తండ్రి శివయ్య బతిమిలాడినా వారు వినిపించుకోలేదు. దాంతో తప్పని పరిస్థితుల్లో పురుటి నొప్పులతో బాధ పడుతున్న హేమలను ఓ ప్రైవేట్ వాహనంలో వికారాబాద్ ప్రభుత్వ అస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స ప్రారంభించక ముందే నార్మల్ డెలివరీ కాగా, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. పరిగి అస్పత్రిలో డాక్టర్, సిబ్బంది ప్రదర్శించిన తీరు దుర్మార్గమని శివయ్య తెలిపారు. కనీసం రెస్పాన్స్ ఇవ్వలేదని, ఇలాంటి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.



వాలీబాల్ పోటీల్లో ప్రణీత్ ప్రతిభ

తాండూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో రాంపూర్‌తండాకు చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. కరీంనగర్‌జిల్లాలో గత నెల 28, 29, 30వ తేదీల్లో అండర్-17 విభాగంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో రాంపూర్‌తండాకు చెందిన చైతన్య కళాశాలలో పీఈటీగా పనిచేస్తున్న రాము కుమారుడు ప్రణీత్ వాలీబాల్ పోటీలో రన్నర్‌గా నిలిచాడు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రణీత్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ నాగభూషణం అభినందించారు.

కుక్కల బెడదపై ఫిర్యాదు

పరిగి,నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పరిగి మునిసిపల్ పరిధిలోని మూడోవార్డులో కుక్కల బెడదపై శుక్రవారం కాలనీవాసులు సల్మాన్ తదితరులు పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. కుక్కలతో కాలనీవాసులు నానాఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కుక్కల బెడదను నివారించాలని కోరారు.

ఇందిరాగాంధీకి నివాళి

తాండూరు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): దేశతొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం తాండూరు ఇందిరాచౌక్‌లో పార్టీ నేతలు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు వి.బస్వరాజ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

వైభవంగా దీపావళి వేడుకలు

ఇళ్లు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో లక్ష్మీ పూజలు... వాడవాడలా టపాసుల మోత..

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, నవంబరు1 : వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గురువారం దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇళ్లముందు ప్రమిదలు వెలిగించారు. దుకాణాలలో లక్ష్మీ పూజలు నిర్వహించారు. యువకులు, యువతులు, చిన్నారులు, మహిళలు ఇళ్లు, దుకాణాల ముందు టపాసులు కాల్చారు. వికారాబాద్ మండలంలో దీపావళీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వ్యాపారసముదాయాల్లో లక్ష్మీ పూజలు నిర్వహించుకోగా ఇంటి వద్ద మహిళలు నోములు చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ముందుగా పూజాకార్యక్రమాలు నిర్వహించి కుటుంబ సభ్యులు, సహాయసిబ్బంది సన్నిహితులతో కలిసి వేడుకలో పాల్గొన్నారు. స్వయంగా స్పీకర్ టపాసులు కాలుస్తూ సందడి చేశారు. మేడ్చల్‌లో చిన్నా పెద్దా తేడా లేకుండా బాణాసంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కిష్టాపూర్ గ్రామంలోని స్మశాన వాటికను విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్మశాన వాటికలోని గోరీల వద్ద దీపాలు వెలిగించటం గ్రామంలో ఆనవాయితీగా వస్తున్న ఆచారం. స్థానిక కౌన్సిలర్ తుడుమ్‌గణేష్ శ్మశాన వాటిక ప్రవేశ ద్వారం నుంచి, పరిసరాల్లో పెద్దఎత్తున విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మేడ్చల్ పట్టణంలోని శ్రీపాద వల్లభ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ నెల అమవాస్య నాడు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని ఏడుగుళ్ల అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించారు.తాండూరులో వ్యాపారులు గురు, శుక్ర వారాల్లో పూజా కార్యక్రమాలను సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మార్కెట్ యార్డులోని వ్యాపారుల నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొని టపాసులను కాల్చారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు సునీతారెడ్డి, కుమారుడు రినీష్ రెడ్డి, మనిషారెడ్డి, అల్లుడు హిమదిప్‌రెడ్డిలతో కలిసి దీపావళి పండుగను జరుపుకున్నారు. పెద్దేముల్, కీసరలో ప్రజలు దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. దీపావళి పండుగను పరిగి పట్టణంతోపాటు ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. పరిగిలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి కుంటుంబ సభ్యులు దీపావళి సంబురాలు జరుపుకున్నారు. పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ తన ఫైనాన్స్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కొడంగల్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, నవాబుపేట మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. దోమ మండల కేంద్రంలో దాసరి రాజేందర్ ఏర్పాటు చేసిన లక్ష్మీదేవి పూజల్లో మాజీ సర్పంచ్ కే.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో చిన్నారుల దీపావళి సందడి



తాండూరు నెహ్రూగంజ్‌లో టపాసులను కాలుస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మేడ్చల్‌లో బీఆర్ఎస్ నాయకుడు మోహన్‌రెడ్డి ఇంటి వద్ద దీపావళి సంబురాలు

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



మృతుడు వీరేశం

మర్పల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నానమ్మ అంత్యక్రియల నిమిత్తం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్లాపూర్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన వీరేశం (40) శుక్రవారం అల్లాపూర్‌లో నానమ్మ పాపమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబ సభ్యులతో కలిసివెళ్లాడు. అంత్యక్రియలు పూర్తయిన తర్వాత తిరిగి ఇంటికి రాకపోవడంతో వీరేశాన్ని కుటుంబ సభ్యులు వెతికారు. గ్రామ సమీపంలో వీరేశం బైక్ రోడ్డు పక్కన ఉండటంతో పాటు బావి దగ్గర దుస్తులు, సెల్‌ఫోన్ కనిపించాయి. బావిలో వెతకగా వీరేశం మృతదేహం లభ్యమైంది. స్నానానికి వెళ్లి బావిలో పడి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్వారీ గుంతలో పడి...

కీసర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సంగారెడ్డికి చెందిన మారుతీ పాటిల్(25) శ్రీశ్రీనివాస మెటల్‌ఇండస్ట్రీ, క్రషర్‌మిల్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. కాగా శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మారుతీ పాటిల్ ద్విచక్రవాహనం, చెప్పులు క్వారీ పక్కన ఉండటం గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో మృతదేహం కోసం గాలించారు. అయినాఫలితం లేకపోయేసరికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు లక్ష్మణ్ తెలిపారు.

చెరువులో స్నానానికి వెళ్లి ...

మేడ్చల్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెరువులో స్నానానికి వెళ్లి కాలు జారి పడి వ్యక్తి మరణించిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బండమాదారం గ్రామంలో పప్పుకుమార్(34) శుక్రవారం స్నానానికి చెరువులో దిగుతున్న క్రమంలో కాలు జారి పడగా అతని తలకు బలమైనగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఝూర్ఖండ్ రాష్ట్రానికి చెందిన వాడని, డ్రైవర్‌గా పని చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

పటేల్ సేవలు చిరస్మరణీయం



వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మేడ్చల్-మల్కాజ్‌గిరి రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు. పటేల్ జయంతి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మునీరాబాద్ గ్రామంలోని పటేల్ విగ్రహానికి బీజేపీ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ దొడ్ల మల్లి కార్జున్‌ముదిరాజ్, జిల్లా కిజాన్ మోర్చనాయకుడు కృష్ణగౌడ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనాథ్‌రెడ్డి, గణేష్, బాబు, రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

మూడో రోజు కొనసాగిన రిలే దీక్ష

వికారాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలని ఏబీవీపీ నాయకులు చేస్తున్న రిలే దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ముందు దీక్ష చేస్తున్న ఏబీవీపీ నాయకులకు బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు యాస్కి శిరీష, మహిళానాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.సీఎం, స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాలకు పక్కా భవనం లేక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి మహేశ్, నాయకులు కార్తీక్, సంజు దయాకర్, తేజ, విష్ణువర్ధన్, శశిధర్‌గౌడ్, కేశవ్ రావు, రాకేష్ యాదవ్, ప్రణీత్, రామకృష్ణ, కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీల పంపిణీ

ధారూరు/కొడంగల్ నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీని శుక్రవారం వికారాబాద్‌లోని ప్రజాభవనంలో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు రూ.7.24 లక్షల విలువగల 18 సీఎంఆర్ఎఫ్ చెక్కులు, రూ.2.50లక్షలఎల్‌వోసీని 13పంచాయతీల పరిధిలోని గ్రామాల లబ్ధిదారులకు వారు అందజేశారు. కొడంగల్ మండలంలోని చిన్ననందిగామ గ్రామంలో చాకలి అంజిలమ్మకు శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించారు.

టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా కమిటీ ఎన్నిక



టీఎస్‌సీపీఎస్‌ఈయూ నూతన కమిటీ సభ్యులు

వికారాబాద్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా కమిటీని శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక క్లబ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా పట్నం రాఘవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండీ అయాబ్, జిల్లా గౌరవాధ్యక్షుడిగా క్రాంతి కుమార్, జిల్లా కోశాధికారిగా నరేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నర్సిములు, జిల్లా ముఖ్య సలహాదారుడిగా భాస్కర్, జిల్లా బాధ్యుడిగా శివప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా నరేందర్, శ్రీనివాస్, వెంకటయ్య, ప్రభయ్య, సుదర్శన్, సురేష్, రఘునాథ్, నర్సిములు, కుమార్, మౌలానా, యాదగిరి, మహిపాల్, ఆంజనేయులు, రాజేందర్, లాలయ్య, బుచ్చిబాబులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి చంద్రకాంత్, టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఐటీ సెల్ రాష్ట్ర ఇన్‌చార్జి గడ్డం వెంకటేశ్, రాష్ట్ర సాహిత్య కార్యదర్శి మురారినాథ్ పాల్గొన్నారు.

గురువులే సమాజ నిర్మాతలు



మాట్లాడుతున్న నందు

ధారూరు, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాతలు గురువులని , సమాజంలో గురువుకు ప్రత్యేక స్థానం ఉందని వికారాబాద్ నియోజకవర్గ బీజేపీ కో ఆర్డినేటర్ వడ్ల నందు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి పదవీ విరమణ అభినందనసభలో ఆయన మాట్లాడారు. బావిభారత పౌరులను తయారు చేసే శక్తి గురువులకు ఉందని ఆయన అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డిని శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజునాయక్, వేణుగోపాల్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శరణరెడ్డి పాల్గొన్నారు.

సీసీఐ జనరల్ మేనేజర్ పదవీ విరమణ

తాండూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కరన్‌కోట్‌లోని ప్రభుత్వరంగ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జనరల్ మేనేజర్ మహాన పదవీ విరమణ పొందారు. శుక్రవారం కంపెనీ కార్యాలయంలో సీసీఐ యాజమాన్యం మహానకు వీడ్కోలు సమావేశం నిర్వహించి శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం నూతన జనరల్ మేనేజర్ శరత్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో అమిత్‌రంజన్, డిప్యూటీ మేనేజర్ జయప్రకాష్, సిబ్బంది శివదత్తు, ఆదిల్‌తోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సంబురాలు

కీసర/కొడంగల్ రూరల్/పరిగి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు, విద్యార్థులు సంబురాలు నిర్వహించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచుతూ ఉతర్వులు జారీ చేసిన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. అంకిరెడ్డిపల్లిలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో, ప్రధానోపాధ్యాయురాలు రాజమణి అధ్వర్యంలో విద్యార్థులు సంబురాలు నిర్వహించారు. ఈ మేరకు బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేశారు. కాగా కొడంగల్‌లో గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రభుత్వం డైట్ చార్జీలు 30 శాతము, కాస్మోటిక్ చార్జీలు 40 శాతం పెంచినందునకు ముఖ్యమంత్రికి ధన్యావాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకుని సంబురాలు నిర్వహించారు. పరిగిలోని మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ బాలిక పాఠశాలలో విద్యార్థులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. చార్జీల గురించి ప్రభుత్వ ప్రకటనపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థినులతో పాటు, ప్రిన్సిపాల్ డి.హరిత, ఏటీపీ జ్యోతిరాథోడ్, జి.సౌజన్య పాల్గొన్నారు.



పరిగిలో సంబురాలు జరుపుకుంటున్న విద్యార్థినులు



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కొండల్‌రెడ్డి తదితరులు

వక్ఫ్‌బోర్డు సమస్యను పరిష్కరించాలని వినతి

ఘట్‌కేసర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి):పోచారం మున్సిపాలిటీ పరధిలోని అన్నోజిగూడ, కాచవానిసింగారం, ప్రతాపసింగారం, యంనంపేట్, కొర్రెముల్ రెవెన్యూ పరిధిలోని వివిధ సర్వేనెంబర్లలో 64 ఎకరాల భూమి వక్ఫ్‌బోర్డు పేరుతో నిషేధిత జాబితాలో చేర్చడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో కౌన్సిలర్ మహేష్, నాయకులు బాల్‌రెడ్డి, కాశయ్య ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

కులకచర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నానికి పాల్పడిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత బాధిత కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని అంతారం గ్రామంలో భూ తగాదాలో చంద్రమౌళి కుటుంబంపై అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావలి బసయ్య కుటుంబం హత్యాయత్నానికి పాల్పడగా బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బసయ్యను శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్, డీఈవో, ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు.

పకడ్బందీగా కుటుంబ సర్వే

● జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్/కొడంగల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్రఇంటింటీ సర్వేకార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ మండలం మదనపల్లిలో చేపట్టిన సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే నిమిత్తం వెళ్లినప్పుడు ఇంటి యజమానిని పూర్తి వివరాలు అడిగితెలుసుకోవాలన్నారు. యజమాని ఇచ్చిన వివరాలను మాత్రమే పొందుపరిచాలని ఆయన సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకొని ఫారాల్లో సమాచారాన్ని క్రోడికరించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌తో పాలు ఎంపీడీఓ వినయ్‌కుమార్, సర్వే అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. కాగా ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలోని హస్నాబాద్, పర్సాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, తాండూర్‌సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన ఫార్మాట్ ప్రకారం ఎన్యూమరేటర్‌లు సర్వే చేపట్టాలని సూచించారు. కుటుంబాల వివరాల సేకరణలో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. వివరాల సేకరణ అనంతరం డెటా ఎంట్రీలో తప్పులు లేకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

పరిగి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులపై కక్ష సాధింపు చేస్తుందని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను విడుదల చేయాలని కోరుతూ, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు సంబంధించి నాలుగేళ్ళుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బలరాంనాయక్, అంబర్‌సింగ్, సునీల్, గోవిద్ తదితరులుపాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

నవాబుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నవాబుపేట మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బద్రీనాథ్, కార్యదర్శిగా జస్వంత్, ఉపాధ్యక్షుడిగా చారి, సహాయ కార్యదర్శిగా మొహ్మద్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, ప్రవీణ్‌చారి, కార్తీక్, సిద్దార్థ, మణికంఠచారి తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

కొడంగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీలో డీలర్‌లు సమయ పాలన పాటించాలని తహసీల్దార్ బి.విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అర్హులైన పేద ప్రజలకు చౌకధరల దుకాణాల్లో అందించే బియ్యం పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ప్రతీ నెల 1 నుంచి 17 వరకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటలకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను డీఎంహెచ్‌వో వెంకటరమణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.
- వికారాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి)

బోరు మోటార్ల కేబుల్ చోరీ

దోమ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దోమ మండలంలోని మోత్కుర్ గ్రామానికి చెందిన మాణిక్య కిష్టయ్య, బోయిని నర్సిములు, గోవర్ధన్, సంపల్లి కమలమ్మలకు చెందిన 6బోరు మోటార్ల కేబుల్, స్టాటర్‌లు, ప్లాస్టిక్ బకెట్లు, బిందెలు, ఇనుప సామగ్రి బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. కేబుల్ ను కాల్చి అందులో ఉన్న రాగి తీగను తీసుకెళ్తున్నారు. మోత్కుర్, తిమ్మాయిపల్లి, రాకొండ తదితర గ్రామాల్లో తరచూ కేబుల్‌దొంగతనాలు జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందున్నారు.

50 ప్రశ్నలు.. 60 రోజులు

(5వ పేజీ తరువాయి)

అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నారు. ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఇతర శాఖల నుంచి ఉద్యోగులను సమగ్ర సర్వేకు సిద్ధం చేస్తున్నారు. ప్రతీ ఎన్యుమరేటర్‌కు ఎన్యుమరేషన్ బ్లాక్ మ్యాప్, ఇళ్ల సర్వే షెడ్యూల్, ఎన్యుమరేటర్స్ మాన్యువల్‌ను అందజేయనున్నారు. సర్వే షెడ్యుల్‌లో చేర్చబడిన 50 ప్రశ్నలపై పూర్తి అవగాహన ఉండే విధంగా వారికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఒక్కో ఎన్యుమరేటర్ ఒక్కో రోజు 15 ఇళ్లను సందర్శించి సర్వే చేపట్టనున్నారు. ఈ సర్వేతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రంగాలలో బలహీనవర్గాలకు ఉపయోగపడుతుందనిప్రభుత్వం భావిస్తుంది. జిల్లాలో ప్రస్తుతం ఉన్న జనాభాలో బీసీలు అధికంగా ఉంటారని తెలుస్తోంది.

పెరుగనున్న జనాభా

2011లో జనాభా లెక్కల ప్రకారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో కుటుంబాల సంఖ్య 5,86,112 కాగా జనాభా 24,60,085గా ఉంది. దాదాపు నాలుగేళ్ల తర్వాత 2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించగా ఆ లెక్కల ప్రకారం.. మొత్తం 7,69,313 కుటుంబాలు ఉండగా జనాభా 28,05,365గా నమోదైంది. 2011 నుంచి 2014 వరకు జిల్లా జనాభా 3,45,270 పెరగగా, 1,71,201 కుటుంబాలు పెరిగాయి. పదేళ్ల తర్వాత మళ్లీ సర్వే చేపడుతుండటంతో జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కుటుంబాల సంఖ్య, జనాభా సంఖ్య పెరుగనుంది.

ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరణ

కుల గణనలో భాగంగా అధికారులు ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టనున్నారు. ఇందులో భాగంగా సర్వేకు ముందే ఒక్కో ఇంటికి ప్రత్యేకమైన స్టిక్కర్ అంటించనున్నారు. ఈ సర్వేలో కులంతో పాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర వివరాలను సేకరించనున్నారు. ప్రతీ కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని నమోదు చేయనున్నారు. అలాగే సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు.

10 శాతం ఇళ్ల రీ సర్వే

జిల్లాలో సమగ్ర కులగణనకు 150 ఇళ్లకు ఒకరి చొప్పున మొత్తం 2,728 మంది ఎన్యుమరేటర్లను ఏర్పాటు చేశారు. ఎన్యుమరేటర్లపై 10 మందికి ఒకరి చొప్పున 279 మంది సూపర్‌వైజర్‌లు ఉంటారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి డాటా సేకరించిన తర్వాత ఆ వివరాలను డేటా ఎంట్రీ కేంద్రాలకు వచ్చి ఆపరేటర్‌తో ఆన్‌లైన్‌లో ఎంట్రీని పూర్తి చేశారు. సూపర్‌వైజర్లు ఫీల్డ్‌లో ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షిస్తారు. ఎన్యుమరేటర్లు సేకరించిన డేటాలో 10 శాతం రాండమ్ కుటుంబాలను ఎంచుకుని ఆ ఇళ్లను క్షేత్రస్థాయిలో సందర్శించి రీసర్వే చేస్తారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. కాగా వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసమే ప్రభుత్వం సమగ్ర కుల గణన నిర్వహిస్తోందని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సర్వేకు అందరూ సహకరించాలి.